క్లుప్తంగా

ఎయిడ్స్‌పై అవగాహన

తనకల్లు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక మూడు రోడ్ల కూడలిలో ఆదివారం ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎయిడ్స్ వ్యాధి ఎలా వస్తుంది? ఎయిడ్స్ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వెంకటేష్ కళాజాత బృందం సభ్యులు పాటల ద్వారా అవగాహన కల్పించారు. హెచ్ఐవీ వ్యాధిగ్రస్తులపై వివక్ష చూపకూడదన్నారు. సుఖవ్యాధులు సోకినప్పుడు తీసుకోవాల్సిన చికిత్సలను వివరించారు. కార్యక్రమంలో జనజాగృతి కదిరి ప్రాజెక్టు మేనేజర్ శ్రీనివాసులు, ఓఆర్‌డబ్ల్యూ రమాదేవి, భవాని, అమ్మజాన్, విహాన్ కిషోర్ పాల్గొన్నారు.

అబాకస్ పోటీల్లో ప్రతిభ



విజేతలుగా నిలిచిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

బత్తలపల్లి: అనంతపురంలోని నవతా స్కూల్‌లో ఆదివారం నిర్వహించిన గణితం అబాకస్, వేదిక్ పోటీల్లో బత్తలపల్లికి చెందిన శ్రీజ్యోతి హైస్కూల్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. 40 పాఠశాలల నుంచి, 2 వేల మంది విద్యార్థులు పోటీలకు హాజరయ్యారు. శ్రీజ్యోతి హైస్కూల్ విద్యార్థులు 15 మంది పాల్గొనగా.. సీనియర్ అబాకస్ లెవెల్-1లో అర్జున్, జూనియర్ వేదిక్‌లో తీర్థి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అలాగే 13 మంది ప్రథమ స్థాయిలో నిలిచారని ప్రధానోపాధ్యాయుడు మిడతల లక్ష్మీనారాయణ తెలిపారు. చిన్నారుల అద్భుత ప్రతిభను, వారిని తీర్చిదిద్దిన ఉపాధ్యాయుడు రమేష్‌ను అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీలు మార్చి 10వ తేదీన విజయవాడలో జరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ ధర్మతేజ, ఉపాధ్యాయులు నాగపెద్దిరాజు, శంకరయ్య, కాటమయ్య, ఆదెప్ప, వెంకటపతి పాల్గొన్నారు.

ముద్దాయికి రిమాండ్

కదిరి టౌన్: ఈనెల 21వ తేదీన పట్టణంలోని టవర్‌క్లాక్ వద్ద మహమ్మద్ షకీల్‌పై అశ్వక్ అనే వ్యక్తి కత్తితో దాడి చేసి గాయపరిచిన విషయం తెలిసిందే. షకీల్ తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో అశ్వక్‌పై కేసు నమోదైంది. అదే రోజు అతడిని అరెస్ట్ చేశారు. ఆదివారం ముద్దాయిని పట్టణ సీఐ పుల్లయ్య పుట్టపర్తి కోర్టులో హాజరుపరిచారు. ముద్దాయికి 14 రోజులు రిమాండ్ విధించారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న లారీ

ముదిగుబ్బ: మండల కేంద్రానికి సమీపంలోని దొరిగిల్లు రోడ్డు బ్రిడ్జి వద్ద ఆదివారం ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొట్టింది. ఈ సంఘటనలో ద్విచక్ర వాహనంలో ప్రయాణిస్తున్న తండ్రి నరసింహులు, కుమారుడు నరసింహ తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. నాగలగుబ్బకు చెందిన వీరిద్దరూ పని నిమిత్తం ద్విచక్ర వాహనంలో ముదిగుబ్బకు వస్తున్నారు. దొరిగిల్లు రోడ్డు బ్రిడ్జి వద్ద వీరి వాహనాన్ని ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. ఈ ఘటనలో తండ్రి నరసింహులు కాలు విరిగింది. కుమారుడు నరసింహ తలకు తీవ్రగాయాలయ్యాయి. గాయపడిన వారిని తొలుత ముదిగుబ్బ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం 108లో అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. కాగా.. కుమారుడు నరసింహ పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

ఘనంగా షబ్ ఏ బరాత్



విద్యుత్ వెలుగుల్లో మసీదు

కదిరి అర్బన్: షబ్ ఏ బరాత్ పండుగను పురస్కరించుకుని పట్టణంలోని పలు మసీదులు ఆదివారం రాత్రి విద్యుత్ దీపాలతో అందంగా ముస్తాబయ్యాయి. ముస్లింలు రాత్రంతా మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. షాబాన్ మాసంలో షబ్ ఏ బరాత్ పండుగ వస్తుంది. మహ్మద్ ప్రవక్తకు అత్యంత ప్రీతి పాత్రమైన మాసం షాబాన్ మాసమని మత పెద్దలు చెబుతారు.

వివాహానికి చేయూత



వివాహ సామగ్రి అందజేస్తున్న ఉపాధ్యాయుడు గోపి

పుట్టపర్తి: బుక్కపట్నానికి చెందిన ఉపాధ్యాయుడు గోపి.. ఓ పేద జంట వివాహానికి చేయూత అందించారు. బుక్కపట్నం గ్రామానికి చెందిన జీవన్‌కు ధర్మవరం మండలం నాగలూరుకు చెందిన నిషాతో పెళ్లి నిశ్చయమైంది. విషయం తెలుసుకున్న ఉపాధ్యాయుడు గోపి ఆదివారం కాబోయే వధూవరులకు మంగళ సూత్రం, పట్టు బట్టలు అందజేశారు. సత్యసాయి భక్తుల సహకారంతో మరో రూ.10 వేలు విలువైన సామగ్రి అందించారు. కోవిడ్ సమయంలో కూడా గోపి పలువురికి సహాయం చేశారు. రాబోవు రోజుల్లో కూడా పేదల ఉచిత వివాహాలకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాజు, ఉపాధ్యాయులు కుమార్, సూరి తదితరులు పాల్గొన్నారు.

ఓటమి భయంతోనే విపక్షాల పొత్తులు

- జగనన్న మరోసారి సీఎం కావడం ఖాయం
- ఆత్మీయ సమావేశంలో సమన్వయకర్త మక్బూల్‌అహ్మద్





మాట్లాడుతున్న సమన్వయకర్త మక్బూల్ అహ్మద్, చిత్రంలో హిందూపురం పార్లమెంట్ సమన్వయకర్త శాంతమ్మ, ఎమ్మెల్సీ మంగమ్మ, సభకు హాజరైన జనం

ఎన్పీకుంట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జనరంజక పాలన చూసి ఓర్వలేని ప్రతిపక్షాలు ఓటమి భయంతోనే పొత్తులు పెట్టుకుంటున్నాయని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్, హిందూపురం పార్లమెంట్ సమన్వయకర్త బోయ శాంతమ్మ పేర్కొన్నారు. ఆదివారం వెలిచలమల గ్రామంలో అదే గ్రామానికి చెందిన బోరెడ్డి వారి ఫ్యామిలీ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకుల ఆత్మీయ సమావేశం జరిగింది. తొలుత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి సభాస్థలి వరరకూ నాయకులు పాదయాత్రగా వచ్చారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో సమన్వయకర్తలు మాట్లాడారు. ఓటమి భయంతోనే చంద్రబాబు పవన్ కళ్యాణ్‌తో పొత్తు పెట్టుకున్నారన్నారు. అయినప్పటికీ ఆయన ఓడిపోవడం ఖాయమని వెల్లడించారు. గతంలో చంద్రబాబు పాలన చూశారని, అలాగే నాలుగు సంవత్సరాల ఎనిమిది నెలల కాలంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన కూడా చూశారని రెండింటిని బేరీజు వేసుకొని ఓటు వేయాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే ప్రకృతి కూడా సహకరించదన్నారు. కరువు తాండవం చేస్తుందని, పల్లెల్లో ట్యాంకర్ల ద్వారా నీరందించాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని జోస్యం చెప్పారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు కదిరి నియోజకవర్గం ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదని తెలిపారు. జగనన్న ముఖ్యమంత్రి అయ్యాక నియోజకవర్గంలోని మారుమూల పల్లెలకు సైతం రోడ్లు వేయించడం జరిగిందన్నారు. సచివాలయం, వలంటీర్ వ్యవస్థలను ఏర్పాటు చేసి దళారీ వ్యవస్థకు చెక్ పెట్టి సంక్షేమాన్ని నేరుగా ప్రజలకు అందించిన ఘనత మన ముఖ్యమంత్రికి దక్కుతుందన్నారు. రూ.9 వేల కోట్లతో మెడికల్ కాలేజీలు, 770 కి.మీ సముద్రతీర ప్రాంతంలో పోర్టులు, హార్బర్లు నిర్మించినా ఎల్లో మీడియాకి ఇవేవి కనిపించవని ఎద్దేవా చేశారు. జగనన్న ప్రభుత్వంలో జరిగిన మంచిని ప్రతి గడపకు చేరవేయాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. అంతేకాకుండా మరో రెండు రోజుల్లో హంద్రీనీవా కాలువ ద్వారా మండలంలోని ప్రతి చెరువుకు నీరందిస్తామని తెలిపారు. రాష్ట్రంలో అభివృద్ధి జరగాలన్నా.. సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మంగమ్మ, సీఈసీ సభ్యుడు పూల శ్రీనివాసులురెడ్డి, మాజీ సమన్వయకర్త ఎస్ఎండీ ఇస్మాయిల్, ఆ పార్టీ మండల కన్వీనర్ కొత్తరంగారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి వేముల ఫయాజ్, సింగిల్‌విండో అధ్యక్షుడు జగదీశ్వర్ రెడ్డి, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు బత్తల వెంకటరమణ, వైస్ ఎంపీపీ కేశవరెడ్డి, బోరెడ్డి కుటుంబ సభ్యులు, ఎంపీటీసీలు, కో–ఆప్షన్ సభ్యులు, సర్పంచులు, వివిధ శాఖల కన్వీనర్లు, డైరెక్టర్లు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

ఖాద్రీ ఆలయంలో పూజలు..

కదిరి టౌన్: నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్, హిందూపురం పార్లమెంట్ సమన్వయకర్త బోయ శాంతమ్మ, ఎమ్మెల్సీ మంగమ్మ తదితరులు ఆదివారం ఖాద్రీ లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారికి స్వామి చిత్రపటాలు, ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గోపాలకృష్ణ, శివకుమార్, గరుడప్ప, అశ్వర్థనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సమన్వయకర్తలకు ఘన స్వాగతం



నాయకులు, కార్యకర్తలతో కలిసి బైక్ ర్యాలీలో పాల్గొన్న సమన్వయకర్త మక్బూల్ అహ్మద్

ఎన్పీకుంట: మండల పరిధిలోని వెలిచలమల పంచాయతీ కేంద్రంలో అదే గ్రామానికి చెందిన బోరెడ్డి వారి ఫ్యామిలీ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్, హిందూపురం పార్లమెంట్ సమన్వయకర్త బోయ శాంతమ్మ, ఎమ్మెల్సీ మంగమ్మ హాజరయ్యారు. తొలుత వీరికి బోరెడ్డి ఫ్యామిలీ సభ్యులు గజమాలలతో సత్కరించి ఘనంగా స్వాగతం పలికారు. గోపాలపురం నుంచి సుమారు మూడు కి.మీ మేర నాయకులు, కార్యకర్తలతో కలిసి భారీ బైక్‌ర్యాలీ చేపట్టారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వం వర్ధిల్లాలి.. కదిరిలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేస్తామని నినాదాలు చేశారు. అనంతరం వెలిచలమల గ్రామంలోని మూడు రోడ్ల కూడలి వద్ద వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అభిమానం చాటుకున్న దివ్యాంగుడు

నాయకులు బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న సమయంలో ఓ దివ్యాంగుడు జగనన్న జెండా పట్టుకొని జేజేలు పలుకుతూ తన అభిమానాన్ని చాటుకున్నాడు. గమనించిన సమన్వయకర్త మక్బూల్ అహ్మద్ బైక్‌ను ఆపి ఆ దివ్యాంగుడి దగ్గరికి వెళ్లి ఆప్యాయంగా పలకరించారు.

తలుపుల మండలంలో టీడీపీకి షాక్



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో సమన్వయకర్తలు మక్బూల్ అహ్మద్, శాంతమ్మ

తలుపుల: మండలంలోని పులిగుండ్లపల్లి హరిజనవాడకు చెందిన దాదాపు 30 కుటుంబాలకు చెందిన టీడీపీ కార్యకర్తలు ఆదివారం గుంత జయరాజు ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి కదిరి నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహమ్మద్, హిందూపురం పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త బోయ శాంతమ్మ పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక అన్ని వర్గాల వారికి సంక్షేమం అందించడంతో పాటు, వారికి సముచిత స్థానం కల్పించడం జరిగిందని తెలిపారు. పథకాలు, అభివృద్ధికి ఆకర్షితులై పార్టీలో చేరడం జరిగిందని కళ్యాణ్, పవన్, సుమిత్ర, జయమ్మ, రాజశేఖర్, శ్రీకాంత్, రామాంజనేయులు, ఆంజనమ్మ, ఓబులప్ప, శ్రీరాములు, చెన్నమ్మ తెలిపారు. పార్టీ బలోపేతానికి అందరూ కృషి చేసి పార్టీ జెండా ఎగురవేద్దామని మక్బూల్ అహమ్మద్ సూచించారు. కార్యక్రమంలో సీఈసీ సభ్యుడు పూల శ్రీనివాసులు రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి వేమల ఫయాజ్, టెంపుల్ చైర్మన్ జెరిపిటి గోపాల కృష్ణ పాల్గొన్నారు.

నేడు గ్రామాల్లో ప్రచారం

నల్లమాడ: దొన్నికోట పంచాయతీ పరిధిలోని బొగ్గలపల్లి, రామాపురం, సుబ్బరాయునిపల్లి గ్రామాల్లో సోమవారం ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి సతీమణి దుద్దుకుంట అపర్ణారెడ్డి ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కే.సూర్యనారాయణ తెలిపారు. ఉదయం 8:30 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

కల్యాణం.. కమనీయం



ఉమా త్రిలింగేశ్వరస్వామికి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు



కల్యాణోత్సవానికి వస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ధర్మవరం అర్బన్: పట్టణంలోని బసవన్నకట్టవీధిలో ఉన్న త్రిలింగేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ఉమా త్రిలింగేశ్వర స్వామి కల్యాణం కనుల పండువగా జరిగింది. ఆలయ అర్చకులు రాఘవ, విజయ్ కుమార్ స్వామి తదితరులు ప్రత్యేకంగా పూలతో తయారు చేసిన వేదికపై ఉమా త్రిలింగేశ్వరస్వామి ఉత్సవమూర్తులు కొలువుదీర్చారు. వేదమంత్రోశ్చారణల నడుమ కల్యాణం జరిపించారు. ఉదయం గంగపూజ, గణపతి పూజ, పుణ్యాహవాచనం, మహాన్యాస పూర్వక ఏకాదశ వార రుద్రాభిషేకాలు చేశారు. పుష్పార్చన, కుంకుమార్చన, మహానైవేద్యం, మంత్రపుష్పం, మహా మంగళహారతి చేపట్టారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి హాజరై స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ మాసపల్లి సాయికుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పాదయాత్రకు సంఘీభావం



చందమూరి నారాయణరెడ్డితో కలిసి నడుస్తున్న ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్ రెడ్డి

తాడిమర్రి: వైఎస్సార్‌సీపీ మరోసారి విజయం సాధించాలని కోరుతూ ధర్మవరం మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ చందమూరి నారాయణ రెడ్డి చేపట్టిన పాదయాత్ర ఆదివారం కాటికోటేశ్వర క్షేత్రానికి చేరుకుంది. అంతకుముందు ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆర్వేటి రామాంజనేయులు తదితరులు పాదయాత్ర బృందానికి ఘనంగా స్వాగతం పలికారు. జెడ్పీహెచ్‌ఎస్‌లో వసతి సౌకర్యాలు, భోజన వసతి కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. నియోజక వర్గంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి ఎనలేని అభివృద్ధి చేశారన్నారు. అనంతరం పాదయాత్ర బృందానికి చిల్లకొండయ్యపల్లి, దాడితోట, చిల్లవారిపల్లి గ్రామాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికారు. పాదయాత్ర బృందం మధ్యాహ్నం 2 గంటలకు కాటికోటేశ్వర క్షేత్రం చేరుకుంది. అక్కడ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. చందమూరి నారాయణరెడ్డి మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ అధిక సీట్లు సాధించి వైఎస్ జగన్ ముఖ్యమంత్రి కావాలని 2017లో ధర్మవరం నుంచి కాటికోటేశ్వర క్షేత్రానికి పాదయాత్ర చేసినట్లు తెలిపారు. అనుకున్నట్లుగానే కేతిరెడ్డి ఎమ్మెల్యేగా గెలవడం, వైఎస్సార్‌సీపీ 151 సీట్లు సాధించి వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయ్యారని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ 175కు 175 స్థానాల్లో గెలిచి జగనన్న మరోసారి ముఖ్యమంత్రి కావాలని మొక్కుకున్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు గజ్జెల శివ, తొండమాల రవి, చలిమి పెద్దన్న, కేశగాళ్ల కృష్ణమూర్తి, చంద్రమూరి రాజగోపాల్‌రెడ్డి, బాలిరెడ్డి, వెంకటరాముడు తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రి

- ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి



వృద్ధురాలికి పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

నల్లమాడ: వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అత్యధిక స్థానాల్లో విజయం సాధించి వైఎస్ జగన్ రెండోసారి ముఖ్యమంత్రి కావడం ఖాయమని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం మండలంలోని పులగంపల్లి గ్రామ సచివాలయం పరిధిలోని కాయలవాండ్లపల్లి, బొగ్గిటివారిపల్లి, వెంకటరెడ్డిపల్లి, యర్రచెరువుపల్లి, పులగంపల్లి గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో గడప గడపకు వెళ్లిన ఎమ్మెల్యే దుద్దుకుంట.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆ కుటుంబాలకు వర్తించిన సంక్షేమ పథకాలు, చేకూరిన లబ్ధిని వివరించారు. ప్రజలు తన దృష్టికి తెచ్చిన సమస్యల పరిష్కారానికి అక్కడికక్కడే చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలే వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయ సోపానాలని పేర్కొన్నారు. గ్రామ, వార్డు సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శమన్నారు. గత ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలన్నింటినీ వంద శాతం నెరవేర్చిన ఘనత వైఎస్సార్‌సీపీకే దక్కుతుందన్నారు. జనమే జగన్, జగనే జనం అన్న రీతిలో ప్రజలు వైఎస్ జగన్ వెంటే ఉన్నారన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. అనంతరం పులగంపల్లిలో రూ.43.60 లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవన సముదాయాన్ని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కే.సూర్యనారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు, మాజీ సర్పంచ్ కే.రవిచంద్రారెడ్డి, ఎంపీటీసీ మహబూబ్ బాషా, మాజీ కో–ఆప్షన్ సభ్యుడు మాబూఖాన్, సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, చంద్రశేఖర్, నీళ్ల సుధాకర్, రాజారెడ్డి, సాంబ, చలపతి తదితర నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

శుభకార్యం

నల్లమాడ: మూలప్పగారిపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు లింగమూర్తి కుమార్తె సంధ్య వివాహం వరుడు యోగేష్‌తో ఆదివారం కదిరి పట్టణంలోని ఓ కళ్యాణ మండపంలో జరిగింది. ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

అమడగూరు: మండలంలోని గొల్లపల్లి సమీపంలో మహమ్మదాబాద్‌కు చెందిన ఉమాశంకర్ నుంచి 87 కర్ణాటక మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ మగ్బూల్ బాషా తెలిపారు. ఆదివారం అక్రమంగా మద్యం తరలిస్తున్నారన్న సమాచారంతో గ్రామ సరిహద్దులో తనిఖీలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఉమాశంకర్‌ను పట్టుకుని అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. ముద్దాయిని కదిరి కోర్టులో హాజరుపర్చినట్లు తెలిపారు.

రాజకీయ ప్రాధాన్యత కల్పించాలి



మాట్లాడుతున్న గిరిజన సంఘం నాయకులు

కదిరి టౌన్: రాష్ట్రంలో గిరిజనులకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని రిటైర్డ్ అడిషనల్ డీజీ డీటీ నాయక్ కోరారు. ఆదివారం ఆల్‌ఇండియా బంజార సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు కాలేనాయక్ అధ్యక్షతన పట్టణంలోని బాలుర కళాశాల ఆవరణలో గిరిజన సింహగర్జన సభ జరిగింది. 20 సంవత్సరాల నుంచే రాయలసీమ ప్రాంతంలో ఒక గిరిజన ఎమ్మెల్యే లేకపోవడం బాధాకరమన్నారు. గిరిజన తండాలకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. ,తండాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. రాయలసీమలో గిరిజన యూనివర్సిటి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. వేరే కులాలను ఎస్టీ జాబితాలో చేర్చరాదని తెలిపారు. ప్రతి జిల్లాకు బంజారా భవనం ఏర్పాటు చేయాలని సూచించారు. కర్ణాటక రాష్ట్రం తరహాలో తండాలను అభివృద్ధి చేయాలన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఎస్పీ రవీంద్రనాయక్, ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర జనరల్ సెక్రటరీ చక్రినాయక్, ఏపీ గిరిజన కో–ఆపరేటివ్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ సోమ్లానాయక్, గిరిజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మాఘ పౌర్ణమి



కొలువైన వరగిరి వేంకటేశ్వర స్వామి



అలంకరణలో సంజీవపురం కాటికోటేశ్వరుడు



తాడిమర్రి: పాలపొంగులు చేస్తున్న దృశ్యం



బత్తలపల్లి: కాటికోటేశ్వర క్షేత్రంలో భక్తుల సందడి

పుట్టపర్తి: బుక్కపట్నం చెరువు గుట్టలో వెలసిన పురాతన వరగిరి వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం రాత్రి మాఘ పౌర్ణమి వేడుకలను గ్రామానికి చెందిన కంసల తిప్పయ్య కుటుంబ సభ్యుల ఆధర్వంలో నిర్వహించారు. ఏటా మాఘ పౌర్ణమి వేడుకలను నిర్వహిస్తున్నామని వారు తెలిపారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు. అభిషేకం అనంతరం ప్రత్యేక పూజలు చేపట్టారు. రాత్రి మొత్తం భజనలు చేశారు. ఈ పూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నల్లనమ్మ ఆలయంలో పూజలు

స్థానిక నల్లనమ్మ గుడి నిర్వాహకురాలు సామకోటి ఆదెమ్మ ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గుడిని చక్కగా అలంకరించి అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

ఘనంగా పాల పొంగులు

బత్తలపల్లి: మాఘ మాసం దీక్షలు చేపట్టిన పలువురు మహిళలు మూడవ ఆదివారం ఆలయాల వద్ద భక్తిశ్రద్ధలతో పాల పొంగులు నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజామునే దేవాలయాలకు వెళ్లి ప్రదక్షణలు చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది. అనంతరం సమీపంలోని దేవాలయాల వద్దకు వెళ్లి అక్కడ పూజలు నిర్వహించారు. అక్కడ కొత్త కుండలో నైవేద్యం చేశారు. నైవేద్యం వండిన కుండను ప్రత్యేకంగా పూజలు చేశారు. మండలంలోని సంజీవపురం కాటికోటేశ్వరక్షేత్రం, సంఘమేశ్వర క్షేత్రంలోనూ, మాల్యవంతం, రామాపురం, కోడేకండ్లలోని వీరనారాయణస్వామి, డి.చెర్లోపల్లి సిద్దేశ్వరాలయం, దంపెట్ల చెన్నకేశవాలయం, ముష్ఠూరు, పోట్లమర్రి శివాలయంలోనూ, గంటాపురం అప్పస్వామి దేవాలయంలోనూ పాల పొంగులు నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని దేవాలయాల వద్ద పండగ సందడి నెలకొంది.

తాడిమర్రి: మండలంలోని పలు గ్రామాల్లో మాఘమాసం సందర్భంగా మహిళలు భక్తిశ్రద్ధలతో పాలపొంగులు నిర్వహించారు. వీరనారాయణ స్వామి భక్తులు మాఘమాసం మూడవ ఆదివారం ఈ పాలపొంగులు కార్యక్రమాన్ని నిర్వహిచడం ఆనవాయితీగా వస్తోంది. తాడిమర్రి, రామాపురం, ఎం.అగ్రహారం, పత్రపల్లి, ఆత్మకూరు, శివంపల్లి, చిల్లకొండయ్యపల్లి, పెద్దకోట్ల, దాడితోట తదితర గ్రామాల్లో భక్తులు పాలపొంగులను ఘనంగా నిర్వహించారు. మహిళలు కొత్త దుత్త (కొత్త కడవ)కు పసుపు, కుంకుమ దిద్ది, పూలతో అలంకరించారు. అనంతరం అందులో బియ్యం, నీరు, బెల్లం, పాలు, యాలక్కాలు తదితర ఆహార పదార్థాలు వేసి నుగ్గల మంటల్లో ఉంచి వండారు. అనంతరం నువ్వులు, బెల్లం, బియ్యం కలిపిన నానవాళ్లను భక్తులకు పంపిణీ చేశారు.

ప్రశాంతంగా గ్రూప్-2 స్క్రీనింగ్

కదిరి అర్బన్: పట్టణంలోని 8 పరీక్షా కేంద్రాల్లో ఆదివారం గ్రూప్–2 స్క్రీనింగ్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. మున్సిపల్ పరిధిలోని బ్లూమూన్ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల,ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, రూరల్ మండలంలో కాలేపల్లి వెంకటేశ్వర డీఎడ్ కళాశాల, కుమ్మరవాండ్లపల్లిలోని స్పేస్ జూనియర్ కళాశాలలో పరీక్షలు జరిగాయి. మొత్తం 2,270 మంది విద్యార్థులకు ఈ పరీక్షా కేంద్రాలు కేటాయించారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ధర్మవరం డివిజన్
9912220727, 9912220726, 9010593486